క్లుప్తంగా

నేడు మేడపాడులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

యలమంచిలి: మేడపాడు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో గత నాలుగున్నరేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, వ్యక్తిగత లబ్ధిపై ప్రజలకు వివరించడంతో పాటు, సచివాలయం వద్ద బోర్డు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

పాలకొల్లు రూరల్‌లో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలకొల్లు రూరల్-1 గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగున్నరేళ్లుగా రూరల్ -1 సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలు వివరిస్తూ ఫ్లెక్సీ ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పాల్గొంటారని తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన మార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్ళే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్ళేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్ళు పైకిలేచి ఉన్నాయి. రోడ్డు శిథిలమయ్యింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. సైకిళ్ళపై వెళ్ళే స్కూల్ విద్యార్థులు ప్రతిరోజూ పడిపోవడం జరుగుతుందని స్థానికులు చెప్తున్నారు. ఎంతోకాలంగా ఈ వంతెన మార్గంవైపు రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. సంబంధింత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయం చేయకుంటే ఉద్యమిస్తాం

ఆకివీడు: చినకాపవరం గ్రామంలో దళితులపై జరిగిన దాడిలో న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గ్రామంలోని బాధితుల వద్దకు వెళ్లేందుకు సోమవారం ఆకివీడు వచ్చిన ఆయన్ని గుమ్ములూరు సెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తీసుకున్న చర్య అభినందనీయమని, బాధితులకు న్యాయం చేకూర్చడమే తమ లక్ష్యమన్నారు. బాధితుల వద్దకు తమను వెళ్ళనివ్వకపోయినా వారికి తగిన న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని, నిందితులపై కఠిన శిక్షలు వేసి, అరెస్టులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆకివీడు, కాళ్ల ఎస్సైలు నాగబాబు, వీరభద్రరావు, పోలీసులు అడ్డుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా, మండల సభ్యులు పాల్గొన్నారు.

మూర్తిరాజుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యాదాత, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు 11వ వర్ధంతి పురస్కరించుకుని భీమవరం టూ టౌన్‌లోని అడ్డవంతెన దగ్గర ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు హాజరై మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో మూర్తి రాజు వందల ఎకరాల్లో ఎన్నో విద్యాసంస్థలు స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహాన్ని అందించారన్నారు. విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది ఉద్యోగాలు సాధించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకున్నప్పుడే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ సుబ్రహ్మణ్యం రాజు, వేగేశ్న రంగరాజు, ఇందుకూరి ప్రసాద రాజు, చేకూరి ఝాన్సీ, బుద్ధరాజు వెంకటపతి రాజు, వీవీ రాధాకృష్ణమూర్తి, గొట్టుముక్కల రామరాజు, మలిశెట్టి సాయిబాబా, అల్లు శ్రీనివాసు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ, పలువురికి గాయాలు


తణుకు: మండలంలోని కొమరవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన చవ్వాకుల వెంకటేశ్వరరావు, బొరుసు కుమారనాగ వెంకటసాయి, కాకి చంద్రశేఖర్, బొంతా సతీష్, డి.శ్యామ్‌లను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే ఆసుపత్రి వద్ద ఎలాంటి ఉద్రిక్తత చోటు చేసుకోకుండా పోలీసులు పహారా ఉన్నారు. తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువర్గాలు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని తణుకు రూరల్ పోలీసులు తెలిపారు.

కార్తీక ఉత్సవాలకు సర్వం సిద్ధం

- పాడ్యమి స్నానాలతో ప్రారంభం కానున్న కార్తీక మాసం
- పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి
- శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక వసతులు
- నేటి నుంచి కార్తీక మాసం పూజలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చక స్వాములు



ఆలయ గాలి గోపురం (పెదగోపురం)

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి కార్తీక మాసం పూజలు ప్రారంభం కానున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ప్రతి రోజూ ఆలయం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. అలాగే కార్తీక సోమవారం, ఆదివారం, కార్తీక పౌర్ణమి రోజుల్లో మాత్రం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనార్థం ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. ఈ కార్తీక మాసంలో నవంబర్ 20, 27, 4, 11 తేదీల్లో నాలుగు కార్తీక సోమవారాలు అలాగే నవంబర్ 19, 26, 3, 10 తేదీల్లో నాలుగు ఆదివారాలు అలాగే 24 శుక్రవారం శిల్క్ ద్వాదశి, 27 సోమవారం కార్తీక పౌర్ణమి వచ్చాయి. ఈ ముఖ్యమైన కార్తీకమాస పర్వదినాలలో ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుందని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక దర్శనం టికెట్లు రూ.50లు, అభిషేకం టికెట్లు రూ.100, అర్చనకు రూ.20, కుంకుమ పూజకు రూ.30లుగా టికెట్ ధరలు నిర్ణయించారు. ఏకాదశి రుద్రాభిషేకం రూ.200, పాశుపతాభిషేకం రూ.300, నెలవారీ అభిషేకాలు చేయించుకునే భక్తులకు అభిషేకాల రుసుం రూ.750, లక్ష కుంకుమ పూజకు రూ.500, లక్షపత్రి పూజకు రూ.1,500లు, లీలా కళ్యాణం రూ.1,116లు, చండీహోమం రూ.1,000, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం రూ.750గా ధరలు నిర్ణయించారు. పోలీస్ అవుట్ పోస్ట్, ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంచనున్నారు.

అభిషేకాల కోసం

ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తుల సౌకర్యార్థం గర్భాలయం వెనుక భాగంలో చలువ పందిర్లు, దక్షిణ భాగంలో ఉన్న నూతన (పాత దేవుని హాలు) అభిషేక మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మండపంలో గణపతి విగ్రహం కూడా ఉండడంతో ముందుగా గణపతి పూజ అనంతరం మహాన్యాసం ఇక్కడ చేసుకుని గర్భాలయంలో క్షీరారామలింగేశ్వరస్వామికి అభిషేకం చేసుకునే విధంగా వెసులుబాటు కల్పించారు. అలాగే సాలగ్రామ, దీప, ఉసిరి, వస్త్ర, గో దానాలు చేసే భక్తుల సౌకర్యార్థం దానాలు తీసుకునే బ్రాహ్మణుల కోసం ఆలయం ఉత్తర భాగంలో గోశాల వద్ద ఏర్పాటు చేశారు.



ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు



ఆలయ వెనుక భాగంలో చలువ పందిళ్లు

రెండేళ్లుగా నిత్యాన్నదానం

స్వామివారి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించి రెండో సంవత్సరం కావస్తోంది. నిత్యం ఆలయంలో దాతల సహకారంతో 300 నుంచి 500 మందికి అన్నదానం చేస్తున్నారు. కార్తీక మాసంలో రోజూ సుమారు 3 నుండి 5 వేల మంది, ముఖ్యమైన పర్వదినాల్లో మాత్రం ఈ సంఖ్య 10 నుంచి 15 వేలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అన్నదానం నిర్వహిస్తారు.

ఆలయంలో ప్రత్యేకతలు

పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో అన్ని ఐదుతో ముడిపడి ఉంటాయి. ఆలయ గాలిగోపురం 120 అడుగుల ఎత్తులో 9 అంతస్తులతో ఉంటుంది. స్వామివారిని దర్శించుకోవడానికి పంచ (ఐదు) ద్వారాలను దాటుకుని వెళ్లాలి. అలాగే ఆలయంలో పంచ శిఖరాలు, పంచ నందులు, పంచ గణపతులు, పంచ లింగాలు, పంచ అమ్మవార్లు, పంచ మండపాలు ఉన్నాయి. క్షీరారామలింగేశ్వరస్వామి కొలువై ఉన్నారు. స్వామికి ఉత్తరం వైపున క్షేత్రపాలకుడు జనార్దనస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దక్షిణభాగంలో వినాయకుడు, గోకర్ణేశ్వరస్వామిలు కొలువై ఉన్నారు. ఈ ఐదు ఆలయాలు వరుసగా ఉండడంతో పంచ శిఖరాలు దర్శనం అని అంటారు. అలాగే స్వామికి తూర్పు ఆగ్నేయ దిశగా సూర్యభగవానుడు, కాశీవిశ్వేశ్వరుడు, పార్వతి, లక్ష్మీ దేవిలు, నగరేశ్వరస్వాములు కొలువై ఉన్నారు. అలాగే దక్షిణంలో సప్తమాత్రుకులు, బ్రహ్మ, కనకదుర్గమ్మ, వీరభద్రులు, పడమర నైరుతి భాగంలో సరస్వతి దేవి, పంచముఖ లక్ష్మీగణపతి, స్వామికి వెనుకభాగం పడమరలో కార్తికేయుడు, వాయువ్యంలో మహిషాసురమర్దిని అమ్మవారు కొలువై ఉన్నారు. ఉత్తర భాగంలో ఆలయం వెలుపల గోశాల వద్ద భీమేశ్వర స్వామి, ఈశాన్యంలో దక్షిణామూర్తి, కాలభైరవుడు, దత్తాత్రేయుడు, నాగేంద్రుడు, నటరాజస్వామి, శనీశ్వరుడు కొలువై ఉన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉత్తర భాగంలో నక్షత్రం వనం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాకారంలో స్వామివారికి తూర్పు ఈశాన్యంలో ఆంజనేయస్వామి, ఆగ్నేయంలో వీరభద్రుడు కొలువై ఉన్నారు.

పార్కింగ్ సమస్య

ప్రస్తుతం ఆలయానికి ఉత్తర భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కింగ్ స్థలంగా ఏర్పాటు చేశారు. అలాగే పంచారామ యాత్రికులను తీసుకువచ్చే బస్‌లు, కార్లకు శనివారం మార్కెట్ రోడ్డు, మార్కెటింగ్ యార్డులోనూ పార్కింగ్ స్థలం కేటాయిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కార్తీక మాసంలో ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. తాగునీరు, ఆరోగ్య కేంద్రం, టాయిలెట్స్ ఏర్పాటు చేశాం. లడ్డూ కౌంటర్లు, ప్రత్యేక దర్శనం టికెట్ కౌంటర్లు, ప్రత్యేక, సర్వదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశాం. కార్తీక మాసం ముఖ్యమైన పర్వదినాల్లో భక్తుల రద్దీని గుర్తించి పోలీసులు, మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ సేవలు అందించనున్నారు.

– యాళ్ల సూర్యనారాయణ, ఆలయ ఈవో

నిత్యాన్నదానం



ఆలయంలో భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేశాం. కార్తీక మాసం నెలరోజులు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. అందువల్ల ఆలయానికి ఉత్తర భాగంలో ఉన్న రేపాక వారి సత్రంలో నిత్యాన్నదానానికి ఏర్పాట్లు చేశాం. అలాగే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా వివిధ సేవా సంస్థల ద్వారా ఉచిత ప్రసాదాలు, పాలు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నాం. కొన్ని సేవా సంస్థల సభ్యులు సేవల్లో పాల్గొననున్నారు.

– కోరాడ శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్

రైతులకు నాణ్యమైన సేవలందించాలి



ఇస్సాక్‌రాజును అభినందిస్తున్న గోపి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: రైతులకు నాణ్యమైన సేవలందించడంలో వ్యవసాయ సలహా కమిటీ ముందుండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండల కో ఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజును సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కార్యాలయంలో గోపిని ఇస్సాక్ రాజు కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా సార్వా సీజన్‌లో ధాన్యం విక్రయాలకు సలహా కమిటీ పూర్తిగా సహకరించాలన్నారు. మిల్లర్లతో, రైతు భరోసా కేంద్రాల్లో ఏ విధమైన సమస్యలు తలెత్తినా తక్షణం స్పందించాలని కోరారు. ఇస్సాక్‌రాజును పార్టీ మాజీ మండల కన్వీనర్ ఎం.ఖేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఏనుగుపల్లి చంద్రశేఖర్, పార్టీ నాయకులు మడికి విక్రమ్, గూట్ల కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నర్సాపురం: పట్టణంలోని పొన్నపల్లిలో అగ్నిప్రమాదం కారణంగా పూరిల్లు కాలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలను సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమై ఇంట్లో నివసిస్తున్న బస్వాని రాంబాబు, రాముడు, వెంకటేశ్వర్లు, లక్ష్మి కుటుంబాల వారు నిరాశ్రలయ్యారు. ముదునూరి బాధిత కుటుంబాలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎండీ ఫాజిల్ మాట్లాడుతూ బాధితులకు ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా 25 కిలోలు చొప్పున బియ్యం పంపిణీ చేశామన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజల్లోకి 'జగనన్న ప్రగతి పథం'

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పెదఅమిరంలో ప్రగతిపథం పోస్టర్ ఆవిష్కరణ



పెద అమిరంలో జగనన్న ప్రగతి పథం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి తెలిపేందుకు ప్రజల్లోకి జగనన్న ప్రగతిపథం పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జగనన్న ప్రగతిపథం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ వింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై భారీ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. గత పాలనలో జరగని అభివృద్ధి తెలియజేస్తూ, గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన రాష్ట్ర ప్రగతిని వివరించడమే జగనన్న ప్రగతిపథం ముఖ్య ఉద్దేశం అన్నారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పర్యవేక్షణలో రాష్ట్ర ఐటీ విభాగం చైర్మన్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని కితాబు ఇచ్చారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆర్థికంగా ఆనందంగా ఉన్నారంటే ఆ గొప్పతనం అంతా సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఐటీ విభాగం సభ్యులు తానంకి కిషోర్ పార్టీ నాయకులు సమక్షంలో జగనన్న ప్రగతి పథం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎల్ఎన్ పురం గ్రామ సర్పంచ్ తానంకి నాగరాజు, ఎంపీటీసీ సీహెచ్ సత్యనారాయణ, కుముదవలి గ్రామ సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణ, తానంకి రఘు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి



చెడుగుడు పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన దాసు ఫ్రెండ్స్ (నెల్లూరు)కు నగదు అందిస్తున్న దృశ్యం

భీమవరం: కబడ్డీ, చెడుగుడు తదితర సంప్రదాయ క్రీడలను నేటి యువతకు పరిచయం చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రులో సెయింట్ పాల్ లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ క్రీడలతో దేహ దారుఢ్యం పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వయసుతో భేదం లేకుండా గంట పాటు క్రీడలు ఆడటం వల్ల ఏ వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. గ్రామాలలో క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రొత్సహించవచ్చన్నారు. ఎంతోమంది గ్రామీణ క్రీడాకారులు దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థిదశ నుంచే క్రీడలలో రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రొత్సహించాలన్నారు. అనంతరం ప్రథమ స్థానం సాధించిన దాసు ఫ్రెండ్స్(నెల్లూరు)కు రూ.40 వేలు, షీల్డ్, ద్వితీయ స్థానం సాధించిన శ్యామ్ ఫ్రెండ్స్(ప్రకాశం)కు రూ. 30 వేలు, షీల్డ్, తృతీయ స్థానం సాధించిన అంబేడ్కర్ జట్టుకు రూ. 25 వేలు, షీల్డ్‌ను అందజేశారు. నిర్వాహకులు తోకల కాంతారావు, వర్ధనపు కాంతారావులు మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 12 వరకు జరిగిన ఈ పోటీలలో 22 జిల్లా జట్లు పాల్గొన్నాయన్నారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపిటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్, కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెస్ శిక్షణ అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవితేజ

సాక్షి, భీమవరం: పిల్లలు క్రీడాల్లో రాణించడానికి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. సోమవారం భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో పిల్లలు సైతం సెల్‌ఫోన్స్, ఇంటర్నెట్‌లకు ప్రభావితులవుతున్నందున విద్యలో వెనకబడటమే కాక కుటుంబ బాంధవ్యాలు కూడా విచ్ఛిన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ చొరవతో చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్‌తో ఆరు గంటల పాటు చెస్‌లో రాణించడానికి క్రీడాకారులకు హై లెవెల్స్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గమిని రవి పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

సాక్షి, భీమవరం: భీమవరంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అధ్యక్షతన మాల మహానాడు అత్యవసర సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా గుమ్మాపు సూర్య వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బహుజన సీనియర్ నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ పాల్గొని ఆకివీడు మండలం కాపవరంలో దళితులపై జరిగిన దాడిని ఖండించారు. దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శులు గోడి పెద్దిరాజు, కుర్రపాటి వీరస్వామి, జిల్లా ఫుడ్ కమిటీ సభ్యులు సాలా అశోక్, సాలా నాని తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి నియంత్రణే లక్ష్యం

ఆకివీడు: షుగర్ వ్యాధి నియంత్రణతో ఇబ్బందుల్ని తొలగించుకోవాలని ప్రముఖ వైద్యులు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు సూచించారు. ప్రపంచ షుగర్ వ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం షుగర్ వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక లయన్స్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాలంలో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. లయన్స్ క్లబ్‌లు, మెడికల్ ట్రస్టు, కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు, బీపీ, కిడ్నీ సంబంధిత రక్త పరీక్షలు, గుండె, కంటి చూపు పరీక్షలు, ఉచిత కంటి ఆపరేషన్లు, కళ్ళజోళ్లు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, ప్రతినిధులు గొంట్లా కృష్ణ, సత్యనారాయణ, సన్నిధి వెంకన్నబాబు, అహ్మద్ పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు

నరసాపురం రూరల్: చీకట్లను పారద్రోలి జీవితాల్లో వెలుగులు నింపే దీపాల పండుగ దీపావళి వేడుకలను ఆదివారం నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్వాడీలంతా తమ బంగారు దుకాణాల్లో లక్ష్మీపూజను అట్టహాసంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులకు కులమతాలకు అతీతంగా పండుగను జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని స్వీట్ షాపుల్లో దీపావళి పండుగను ప్రతిబింబించేలా ప్రత్యేకమైన ఆకారాల్లో తయారు చేసిన స్వీట్లు అందరినీ ఆకర్షించాయి. విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఉద్యోగ రీత్యా దూరప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు కూడా ఇళ్లకు రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

నేటి నుంచి తూర్పుతాళ్లులో పంచాయతన మహాయజ్ఞం

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు శ్రీ విష్ణు పంచాయతన మహాయజ్ఞ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆగమ పండితులు అరవల్లి జగన్నాధాచార్యులు తెలిపారు. గ్రామంలోని దొరయ్యగారి ఇంటి ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ ఉదయం సుప్రభాత సేవా కాలం, అనంతరం తిరుప్పల్లాండు, తరుపళ్‌పెయ్యేళిచ్చి, తిరుప్పావై పారాయణం, గణపతి, ఆదిత్య, రుద్ర హోమాలతో పాటు ప్రతి రోజూ సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, చతుస్థానార్చన, పంచాయతన హోమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 17 చండీహోమం, 20వ తేదీన సామూహిక శ్రీనివాస కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గోగులమ్మ ఆలయ వార్షికోత్సవం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కొత్తపాలెంలో వేంచేసి ఉన్న గోగులమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గతంలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునఃనిర్మాణం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం ప్రారంభం కూడా కావడంతో పెద్దెత్తున మహిళలు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నరసాపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నరసాపురం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పీఎస్ త్రినాథ్, లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు. కాటన్ పార్కు వద్ద నూతనంగా గ్రంథాలయ భవనం నిర్మిస్తున్న ప్రాంతంలో జెండాను ఆవిష్కరించి ఉత్సవాలు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. వారంరోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కొప్పర్రులో..

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు పుస్తక పంపిణీ కేంద్రం ఆధ్వర్యాన జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రీడర్స్ ఫోరం అధ్యక్షుడు పోలిశెట్టి రమేష్ తెలిపారు. 16వ తేదీ గురువారం జూనియర్స్‌కు (6,7 తరగతుల విద్యార్థులు) ఓటు హక్కు- మనందరి బాధ్యత కూడా అనే అంశంపై వ్యాసరచన, పర్యావరణం - ఎందుకు పరిరక్షించుకోవాలి అనే అంశంపై వక్తృత్వ పోటీలు, సీనియర్ (8,9,10) తరగతుల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో మతం పాత్ర ఎంత వరకు అనే అంశంపై వ్యాస రచన, యుద్ధాలు-మానవ హక్కులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సీనియర్స్‌కు సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్స్‌పై క్విజ్ పోటీ కూడా నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు పోలిశెట్టి గోఖలే మాస్టారు తెలిపారు.